సీరియల్



(గతసంచిక తరువాయి)

"అయితే మనల్ని బంధించటానికి, ఆ స్పిరిట్సుకి ఏం సంబంధం లేదంటారా?" అన్నాడు వర్మ కార్తీక్ వంక తిరిగి!

"అదే నా అభిప్రాయం! అయితే ఈ మాంత్రికుడి అనుచరులు బహుశా పగసాధించే నిమిత్తం మనల్ని పట్టుకున్నారని నా అనుమానం!"

"పగా, దేనికి? వీళ్ళను మనమేం చేశాం?"

"మనలాంటి వాళ్ళేకదా, వీళ్ళ గురువును, తోటి సహచరులను మట్టుపెట్టింది! అందుకు మనమీద కక్ష సాధిస్తున్నారేమో!"

"అదేమిటి, యెవరో చేసిందానికి మనమీద కక్ష సాధించటం దేనికి?"

వర్మ తన వాళ్ళవంక చూసి, "మీ చేతుల్లో తుపాకు లేవీ?" అన్నాడు. తన దగ్గర రివాల్వర్ లేకపోవటం కూడా గమనించాడు అప్పుడే.

"వాళ్ళు లాగేసుకున్నారు. మా జేబుల్లోను, బెల్టుకట్టి దాచుకున్న బుల్లెట్సుకూడా తీసేసుకున్నారు. మేము ఏమీ చేయలేని స్థితిలో వుండిపోయాం!" అప్పుడు చెప్పాడు.

"అదే, అదే వశీకరణం! మిమ్మల్ని వశీకరణ మంత్రంతో ఆకట్టేసుకున్నారు వాళ్లు!" హిమవంత్ అన్నాడు.

"అబ్బ, యిక్కడేదో చెడు వాసన ముక్కుపుటాల్ని అదరగొడుతోంది!" అన్నది దీప్తి.

అభిలాష్ చిన్నగా నవ్వి, "ఇంతవరకు మీరెవరూ సరిగ్గా గమనించలేదుగాని, మనల్ని బంధించిన తాడు మామూలు తాడుకాదు! ఏవో జంతువుల నరాలతోను, పేగులతోను అల్లిన తాడు!" అన్నాడు.

అందరు ఒక్కక్షణం ఉలిక్కిపడి తమకి కట్టివున్న తాళ్ళవంక చూసి కెవ్వుమన్నారు.

నిజమే, ఏదో జంతు సంబంధమైన నరాలతోను పేగులతోను అల్లిన తాడు అది!

అందరికీ కడుపులో తిప్పినట్టయింది. ఏమీ తిని వుండలేదుగాని లేకుంటే కడుపులో నిదంతా బయటికొచ్చేసి వుండేది—ఆ వాసన ఆ తాళ్ళనుండి వస్తూన్నదే!

"ఎంత పాపాత్ములు వీళ్ళు! అసలు మనల్ని యిలా ఎందుకు కట్టిపడేశారు? చంపేసినా పీడా పోయేది!" అశ్విని కోపం, నిస్సహాయత ముప్పిరిగొంటున్న కంఠంతో అన్నాడు. అతడసలే ఆత్మాభిమానం పాలెక్కు వున్న వాడు.

హిమవంత్ కూల్‌గా చూస్తూ, "ఒక్కసారి వచ్చిపోతే ఏముంది బ్రదర్! నాలుగు వింతలు చూసి చావాలి!

నీకన్న ఓసారి ఎక్కువ తాళ్ళతో కట్టించుకున్న నా సంగతేమిటి మరి? మాంత్రికుడికి నామీద ఎంత ప్రేమ లేకపోతే నన్ను స్పెషల్‌గా బలివ్వబోయాడో నీకేం తెలుసు?" అన్నాడు నవ్వుతూ, బలి కార్యక్రమాన్ని మనోపథంలోకి తెచ్చుకుంటూ.

కార్తీక్ ఓసారి చిన్నగా హిమవంత్‌ని గిల్లాడు. అతను నోరు విప్పితే రహస్యాలు వాటంతటవే వెల్లువలా బయటికొచ్చేస్తాయి! వాటిని కప్పిపెట్టడం మళ్ళీ తనవల్ల కాదు.

హిమవంత్ బుద్ధిగా నోర్మూసేసుకున్నాడు.

అప్పటికే వర్మకి ఉప్పు అందిపోయింది.

"అంటే మీ అందర్నీ మాంత్రికుడు బంధించి వుంచ లేదా?" అన్నాడు కార్తీక్ వంక సాభిప్రాయంగా చూస్తూ వర్మ.

"అశ్వని, భరణిని తప్ప అందర్నీ బంధించారండి. వాళ్ళిద్దరు చివర్లో లోపలికి పరుగెత్తుకొచ్చి ఓ పక్కగా దాగుండిపోయారు!" అన్నాడు కార్తీక్.

"ఓహ్, వాళ్ళిద్దరు నక్షత్రాలు కదూ!" అన్నాడు వర్మ చిన్నగా నవ్వి.

అతని జోక్ వెంటనే అర్థంకాలేదు వాళ్ళకి! అశ్వని, భరణి, కృత్తిక మొదలైన నక్షత్రాల గురించి అతను చెప్తున్నాడని అర్థమయింది తర్వాత.

అభిలాష్, హిమవంత్ చెవిలో, "ఆ వర్మతో ఎందుకలా ఆ సమాటు పరాచికాలాడతావు? పైకి కనిపించేటంత సౌమ్యుడు కాదనుకుంటానతను. అతని చిరాకులు, పరాకులు గమనించావా?" అన్నాడు.

హిమవంత్ కూడా అదే స్థాయిలో, "కావాలనే

అతన్ని ఆటపట్టిస్తున్నాను. అతని మాటవిని యీ గుహలోకి అడుగు పెట్టడంవల్ల కదా మనకిన్ని కష్టాలు?" అన్నాడు.

"అదేమన్నమాట? ఓ విధంగా వర్మ, అతని పనివాళ్ళు మన ప్రాణాలు కాపాడారనే సంగతి మర్చిపోయావా?"

"అందుకే కదా, ఎంతమాత్రం యిష్టం లేకపోయినా అతనితో కలిసి లోపలికొచ్చాం. ఇక్కడ యిరుక్కుపోయాం! ఓ పక్క తిండిలేక శోషవస్తోంది కూడా! బాగా ఆకలిగా వుంది."

"ఏం చేస్తాం? ఓ గంటలో వెళ్ళిపోవచ్చు కదా అనుకున్నాం. ఇలా జరుగుతుందని తెలీదు కదా!"

కార్తీక్‌కి తన మిత్రుల సంభాషణ చూచాయగా వినిపిస్తోంది.

వర్మ ఏదో చెప్పాలని నోరు తెరిచాడు. సరిగ్గా అదే సమయంలో నలుగురు అనుచరులు — యిందాకటి పది మందిలోనీ వాళ్ళు - లోపలికొచ్చి వాళ్ళముందు నిలిచారు.

అందులో ఒకడు సూటిగా వాళ్ళవైపు చూసి, "మీరంతా ఎవరు? ఎందుకు మా తపస్సమాధిలోకి కాలు పెట్టి అపవిత్రం చేశారు?" అనడిగాడు.

వర్మ తలెగరేసి, "తపస్సమాధియా? మీరు తపస్సు చేసుకునే మునీశ్వరులు, మునికుమారులు అయితే హిమాలయాలకో, అడవులకో పోకుండా యిలా భూగృహాల్లోను, గుహల్లోను వుండడం దేనికి?" అన్నాడు.

"అది మా యిష్టం. ఇక్కడ మా తపస్సు ఏర్పాటు చేసుకున్నాం! మా స్థలంలో అడుగుపెట్టి మమ్మల్ని భగ్నం చేసిందికాక వితండ వాదం దేనికి?" అన్నాడు

మరొకడు.

వాళ్ళతో వాదించటం అనవసరమనుకుని మౌనం వహించారు అందరు.

"చెప్పండి, మీలో మా గురువుగార్ని, మా సహచరుల్ని చంపినదెవరు?" మొదటివాడు అందరి వంకా కర్కశంగా చూశాడు.

"మేమెవరమూ కాదు!" అన్నాడు కార్తీక్.

"మీరే, మీరే చంపారు. అబద్ధం చెప్పి ప్రయోజనం లేదు. మాకు తెలీదనుకోకు" అతను అరిచాడు.

"తెలిస్తే మమ్మల్నడగడం దేనికి?" హిమవంత్ చురక అంటించాడు.

వాళ్ళకు నషాలం అంటింది. చకచక రెండోవాడు హిమవంత్ దగ్గరగా వెళ్ళి అతన్ని గుండెలమీద కాలెత్తి తన్నాడు. హిమవంత్ బాధతో మూలిగాడు.

"జాగ్రత్త, మాతో పరాచికాలాడకు" అన్నాడు పైగా.

"మునికుమారుడి నంటున్నావు, ఇలా తన్నటం వేలటం తపస్సు చేసుకునేవాడి లక్షణమా?" హిమవంత్ కోపంగా అరిచాడు.

ఆ అనుచరుడు మళ్ళీ తన్నాడు. "ఇక అట్టేవాగొద్దు. మీ అందర్నీ నిలువునా ఇక్కడే పాతేస్తాం! మా స్థావరంలోకి ప్రవేశించే అధికారం ఎవరికీ లేదు. ఇక్కడికొచ్చినవాడు ప్రాణాలతో బయటికి వెళ్ళినది లేదు!" అన్నాడు.

మొదటివాడు అందర్నీ కలియచూసి, "మర్యాదగా మా వాళ్ళను చంపిన వాళ్ళెవరో చెప్పండి. వాళ్ళను

మాత్రం మా దేవికి బలిచ్చి తక్కినవాళ్ళని వదిలేస్తాం!" అన్నాడు.

శర్మ కల్పించుకుని, "మీ గురువుగార్ని, మీ సహచరుల్ని చంపినవాళ్ళు మా చేతుల్లో చచ్చారు. కావాలంటే గుహల బయట వాళ్ళ శవాలున్నాయి, పోయి చూసుకోండి!" అన్నాడు.

"మేం నమ్మం! మీరే చంపారు. వాళ్లెవరో మీలోనే వున్నారు. మీ అందరూ యీ రాతిగదిలోపడి మలమల మాడి చావండి! మీ మొండి ప్రవర్తనకు, మీరుచేసిన దారుణానికి అదే శిక్ష!" అంటూ వాళ్ళు నలుగురు బయటికి వెళ్ళిపోయి ద్వారం మామూలుగా రాతి పలకలో మూసేశారు.

అందరు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

* * *

శర్మ లవుడి వంక చూసి, "హేండ్ బాంబులున్నాయా?" అనడిగాడు.

లవుడు జేబులు మోచేత్తో తడుముకుని, "ఉన్నాయి" అన్నాడు.

శర్మ కుశుడి వంక చూశాడు. అతను కూడా తడిమి చూసుకుని తలూపాడు.

"ఫ్రెండ్స్! మా దగ్గర హేండ్ బాంబులున్నాయి! వాటిని ప్రయోగించి యీ జింక చర్మంగాళ్ళని నాశనం చేసేద్దామా?" అన్నాడు శర్మ.

"బాంబులా?" అదిరిపడ్డా రందరు.

"అవును. ఇక వేరే దారిలేదు. వీళ్ళు మళ్ళీ వచ్చే లోపల మనం తాళ్ళు విప్పేసుకుని సిద్ధంగా వుందాం. వీలయితే బాంబులు ప్రయోగించకుండా బయటపడదాం!

తప్పనిసరి పరిస్థితుల్లో ఉపయోగిద్దాం!" అన్నాడు వర్మ.

కార్తీక్ తల అడ్డంగా తిప్పి, "వాటివల్ల ఈ మంత్ర గాళ్ళను చంపేయటం తేలిక కాదనను! కాని వాళ్ళతో బాటు మనం చచ్చిపోతాం!" అన్నాడు.

"అదెలా?"

"ఇది భూగృహమన్న సంగతి మరిచిపోయారా? బాంబుల ఆదురుకు అంతా కూలిపడిపోతుంది. బిలాన్ని తొలిచి సొరంగం చేసి లోపల వీళ్ళు నివాసముంటున్నారు. మనం బయటికి పరుగెత్తడానికి కనీసం ఓ పావుగంటకి తక్కువ పట్టదు! ఈలోపల బిలం పూర్తిగా కూలి పూడి పోతుంది!" అన్నాడు కార్తీక్.

అవునన్నట్టు తలూపాడు వర్మ.

"మరెలా?"

"ముందు మన బంధనాలు తప్పించుకోవటమే! అదేం పాపమో మేము యీ టైగర్ హిల్స్‌కు వచ్చాక ఏ కొద్ది గంటల మాత్రమో ఫ్రీగా వున్నాం. అంతే! ఆ తర్వాత ఎవరోకరు మమ్మల్ని కాళ్లు చేతులు కట్టిపడేస్తూనే వచ్చారు" అన్నాడు అభిలాష్.

అందరు విరక్తిగా నవ్వుకున్నారు.

"ఈ నరాలు తెంపుకోవటం సాధ్యమయ్యే పనికాదు. ఏదైనా చాకో బ్లేడులాంటి ఆయుధమో వుంటే తప్ప బంధాలు తెంచుకోవటం కష్టం!" అన్నాడు కార్తీక్.

అశ్వని అటు యిటు చూసి, "అదిగో ఆ రాతిపలక చాలా సూదిగా కత్తిలా వుంది. దానికి రాపాడిస్తే ఫలితం వుండొచ్చు!" అన్నాడు.

అందరి దృష్టి అటు మళ్ళింది. అవును, అశ్వని చెప్పింది నిజమే!

ఓ అరగంట తర్వాత అందరిచేతులు కాళ్ళు తిరిగి రక్త ప్రసరణాన్ని నిరాటంకంగా ప్రసాదింప చేయగలిగాయి.

"వాళ్ళొచ్చే వరకు ఆగటం దేనికి, పదండి పోదాం!" అన్నాడు కార్తిక్ వర్మ నుద్దేశించి.

"అప్పుడు కూడా వీళ్ళు వెంటపడి వేధించరని నమ్మకమేముంది? వీళ్ళ అంతేదో చూసే వెళ్దాం!" అన్నాడు వర్మ.

ఎవరికీ అతని మాటలు రుచించలేదు. కావాలని పంతానికి పోతున్నాడు వర్మ! యెలాగో తప్పించుకు బయటపడితే చాలని అందరి మనసుల్లోనూ వున్న అభిలాష!

వాళ్ళు కాళ్ళు కదిలించేలోపల ఎలా గమనించారో మాంత్రికుడి అనుచరులు లోనికొచ్చారు. అయిదుగురు!

ఒక్కసారి వర్మతో బాటు లవుడు కుశుడు వాళ్ళమీద పడిపోయారు. గది అమర్చిన రాళ్ళతో వాళ్ళని మోదేశారు గట్టిగా.

ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశారు. మరో యిద్దరు చాలా లాఘవంగా తప్పించుకు పారిపోయారు!

"మిస్టర్ కార్తిక్! వాళ్ళను వదలొద్దు. తక్కిన వాళ్ళను తీసుకొస్తారు. వెంట మారణాయుధాలు కూడా తెస్తారు. బి, ఎలర్ట్!" అన్నాడు వర్మ.

లవుడు, కుశుడు వేటకుక్కల్లా కొంతదూరం ఆ ఇద్దర్ని తరిమి మళ్ళీ వెనక్కి వచ్చారు.

"అక్కడ ఏవో చిన్న చిన్న గదుల్లాగా వున్నాయి. అందులో దూరారు వాళ్ళు!" అన్నాడు కుశుడు.

"మన తుపాకీలు ఎక్కడ దాచేశారో తెలియదు. అవే వెంట తెచ్చి మనల్ని చంపినా అనుమానంలేదు!"

అన్నాడు లవుడు.

"మనం యీ రాళ్ళనే ఆయుధాలుగా తీసుకుని వాళ్ళని యెదిరించాలి. అంతకుమించి ఆయుధాలేము న్నాయి?" అన్నాడు కార్తీక్.

అందరు రాళ్ళ గదిలోపలికి వచ్చేశారు.

"వాళ్ళు గుళ్ళు పేల్చినా మనకి ఈ రాళ్ళు రక్షణగా వుంటాయి. ఇందులో బోర్లా పడుకోండి అందరు!" అన్నాడు కార్తీక్ మిత్రులవంక చూసి.

అందరు రాబోయే ప్రమాదాన్ని మౌనంగా ఎదుర్కోవ టానికి సిద్ధంగా వున్నారు.

అరగంట గడిచింది, గంట గడిచింది! ఎవరూ రాలేదు.

ఎక్కడా ఎలాంటి అలికిడీ లేదు.

అందరూ తలలు పైకెత్తి రాతిగదిలోనించి బయటికి చూశారు. చచ్చిన ముగ్గురు అనుచరులు తప్ప అక్కడ యెవరూ లేరు!

వర్మ సాలోచనగా కార్తీక్ వంక చూసి, "వీళ్ళేదో పెద్ద ప్లాన్ మీదున్నారు. ఇలా ఎంతసేపుంటాం? పదండి, వాళ్ళ సంగతి యిప్పుడే తేల్చుకుందాం!" అన్నాడు.

"మనం గదిబయటికి రావటంకోసమే వాళ్ళు ఎదురు చూస్తున్నారేమో! బయటికి రాగానే దాడిచేసి నిర్దా క్షిణ్యంగా కాల్చేస్తే....?" అన్నాడు కార్తీక్.

"వాళ్ళు చూడబోతే పిరికినాయాళ్ళలా వున్నారు. మనం యెదురు తిరగ్గానే పారిపోయారు. ధైర్యమున్న వాళ్ళయితే యీపాటికి తప్పకుండా వచ్చి వుండేవాళ్ళు- మన దగ్గర ఆయుధాలు లేవుగాని, వాళ్ళకేం? మన తుపాకీలు రెండు, రివాల్వర్ ఒకటి, రౌండ్స్ అన్నీ వున్నాయి."

"అయితే వాటిని ప్రయోగించటం తెలీదేమో!"

"సరే మా లవుడు, కుశుడు పోయి వస్తారు! తర్వాత మనం వెళ్లొచ్చు!" అన్నాడు శర్మ.

లవుడు కుశుడు వెంటనే లేచి బయటికి వెళ్ళారు. అందరికీ గుండె లయ తప్పి నడుస్తోంది. వాళ్ళిద్దరు నిర్భయంగా, యిందాకా అనుచరులు తప్పించుకు పోయిన దిశగా వేగంగా సాగిపోయారు!

అరగంట గడిచింది.

గంట గడిచింది. వెళ్ళిన యిద్దరి జాడలేదు!

శర్మ అసహనంగా కదిలాడు.

"లాభంలేదు, వీళ్ళిద్దర్నీ వాళ్ళు పట్టుకున్నారు. బహుశా ప్రాణాలతో వుంటారో, లేదో తెలీదు! మీరు నాతో రాదలచుకుంటే రండి, నే వెళ్తున్నాను!"

"శర్మగారూ! పదండి. మేమూ వస్తున్నాం" అన్నాడు శాస్త్రీక్.

శర్మ వాళ్ళ వంక అభిమానంగా చూసి నవ్వాడు.

అందరు లవుడు, కుశుడు వెళ్ళినవైపుగా నడుచుకుంటూ పోయారు. నడిచినంతసేపు పక్కలకు కాషన్‌గా చూసుకుంటూనే వున్నారు. ఏ మూలనుండి అనుచరులు ఎటాక్ చేస్తారోనని అందరికీ ఓ పక్క అనుమానంగానే వుంది!

అక్కడ తమను బంధించిన రాతిగదుల వంటివి ఒకదానిపక్క మరొకటిగా నాలుగైదు కనిపించాయి.

శర్మ సాభిప్రాయంగా శాస్త్రీక్ వంక చూశాడు. ఒకరి వెనుక మరొకరు చప్పుడు చెయ్యకుండా ఆ గదుల్ని సమీపించారు.

మొదటి గది దగ్గర ఆగారు.

రాతికి రాతికి మధ్య వున్న ఖాళీల సందునించి లోపలికి చూశారు.

అంతే! అందరి నరనాడులూ భయంతోను, గగుర్పాటుతోను స్తంభించి పోయాయి! ఊపిరిపీల్చటం మరిచి అటే చూడసాగారు.

లోపల నిలువెత్తు కాళికా విగ్రహం! సరిగ్గా నేల మాళిగ మెట్లు కిందచూసిన విగ్రహంలాగానే వుంది. అదే తెచ్చి అక్కడ పెట్టారా అన్నంత దగ్గర పోలిక!

విగ్రహం కాళ్ళ ముందున్న మధ్య శిలలమీద లవుడు, కుశుడు తలల మొండేలనుంచి వేరుపడి రక్తం మడుగులో పడివున్నారు.

విగ్రహం ముందు నిల్చుని వున్న వ్యక్తిని చూస్తూనే అందరు అదిరిపడ్డారు. అతని చేతిలో రక్తం కారుతున్న కత్తి!

అతని గుండెలమీద త్రిశూలంతో చేయబడ్డ మూడు గాయాలు నల్లగా స్పష్టంగా కనిపిస్తున్నాయి! చనిపోయాడనుకున్న మాంత్రికుడు సజీవంగా కనిపించటంతో వాళ్ళు విస్తుపోయి చూస్తున్నారు.

* * *

కొద్ది క్షణాలసేపు ఎవరూ మాట్లాడకుండా కదలకుండా అలాగే శిలా ప్రతిమల్లా నిల్చుండిపోయారు.

శర్మ ఆగ్రహంతో నిలువెల్లా ఒణికిపోతున్నాడు. చేతులారా యిద్దరు నమ్మిన బంట్లను అలా మాంత్రికుడికి బలిచేశానే అని పశ్చాత్తాపంతో తల్లడిల్లి పోతున్నాడు. లవుడు, కుశుడు తన మాటమీదే తెగించి మాంత్రికుడి గుహలోకి చొచ్చుకుపోయి ప్రాణాలు పోగొట్టుకున్నారు! తనే....తనే...వాళ్ళని కోరి మృత్యు గుహలోకి పంపిం

చాడు!

కా రీక్ తేరుకుని వర్మ చేతిని మృదువుగా నొక్కాడు. అందరికీ వర్మ మనో సంక్షోభం బాగా అర్థమయింది! ఓ విధంగా తమ ప్రాణదాత లిద్దరు ప్రాణాలు పోగొట్టుకున్నారు! ఉన్న ఒకడు—వర్మ—అతనే ప్రస్తుతం తమకు ఆత్మీయుడు, శ్రేయోభిలాషి, మార్గదర్శకుడు!

అశ్వని, హిమవంత్ ఆవేశంతో పిడికిళ్ళు బిగించి, "ఎటాక్ యిచ్చేద్దామా?" అన్నారు.

కా రీక్ మందలి స్తున్న ధోరణిలో వాళ్ళవంక చూసి, "బతకాలని లేదా? మన చేతుల్లో ఏ విధమైన ఆయుధాలుగాని, ప్రాణరక్షణ సాధనాలుగాని లేవు. ఎలా ఎటాక్ చేద్దామనుకుంటున్నారు?" అన్నాడు.

దీప్తి ఆ దృశ్యం చూడలేక ముఖం తిప్పేసుకుంది! అభిలాష్ ముఖంలో ఎలాంటి భావము వ్యక్తం కావటం లేదు. ఏదో ఆలోచిస్తున్నాడు.

ఈలోపల రాతిగదిలోని మాంత్రికుడు కదిలాడు. కాళికా విగ్రహంవైపు దీక్షగా చూస్తూ పెదవులు కదిలిస్తున్నాడు. అతనికి యిరువైపులా శిష్యులు నమ్రతగా నిల్చుని అగ్నిలో ఏవేవో మూలికలు వేల్చుతున్నారు.

నిలువెత్తు కాళికా విగ్రహం లవుడు, కుశుడి రక్తాన్ని తనివితీరా ఆరగించినట్టు, బాగా తృప్తిచెందినట్టు శాంత గంభీరంగా వున్నట్టు అనిపించింది అందరికీ. వర్మ ముఖం కాళికా విగ్రహం ముఖం రెండూ ఎర్రగానే వున్నాయి. వర్మ ముఖం ప్రతీకార జ్వాలతో ఎర్రబడితే, అమ్మవారి ముఖం అక్కడి ఎర్రటి మంటల వెలుగు ప్రతిఫలించి ఎర్రబడింది!

మాంత్రికుడు వంగి లవకుశుల వెత్తురుతీసి అమ్మవారి

నోటికి పూశాడు. అంతదాకా ఏదో పాత్రలో పట్టి వుంచిన వాళ్ళిద్దరి నెత్తురు విగ్రహం కాళ్ళముందుకి జరి పాడు. గుగ్గిలంలాంటి ఏదో పదార్థం పొగవేశాడు.

గాలిగదినిండా దట్టమైన ఘాటైన పొగ అలముకుంది.

శిష్యులు గట్టిగా మంత్రాలు వల్లిస్తూ నించుని వున్న వాళ్ళు ఒక్కసారిగా చలనం వచ్చినట్లు అటు యిటు గెంతుతూ నాట్యం చేయసాగారు.

అశ్విని లెక్కపెట్టాడు—సరిగ్గా ఏడుగురున్నారు—మాంత్రికుడితో కలిసి ఎనమండుగురు! అంటే పదిమంది శిష్యులున్నారన్నమాట. ముగ్గుర్ని తాము చంపేశారు! గతంలో యిద్దర్ని నేలమాళిగ మెట్లవద్ద చంపేశారు. వాళ్ళతో కలుపుకుని వీళ్ళు పన్నెండుమంది అనుచరు లన్నమాట.

అశ్విని మాటి మాటికీ ఒకటే మాట మననం చేసు కుంటున్నాడు — శత్రుశేషం వుంచరాదు. ఈ ఎనిమిది మందిని చంపిగాని బయటికి పోకూడదు.

అభిలాష్, హిమవంత్, కార్తీక్ కూడా యిదే ఆలో చిస్తున్నారు. దీప్తి ముఖంలో ఎలాంటి భావము ద్యోతకం కావటంలేదు. వర్మ ఆ క్షణమే వాళ్ళందర్నీ చంపి పారేద్దా మన్నంత కోపంతో ప్రతీకార వాంఛతో రగిలి పోతున్నాడు.

అందరి వంకా తిరిగి, "మన ఆయుధాలు బహుశా పక్క గదుల్లో వున్నాయేమో పోయి చూద్దామా?" అన్నాడు.

కార్తీక్ తలూపాడు. "ఇలాంటి రాతి గదులే ఇంకా మూడు—నాలుగున్నట్టుంది. బహుశా అందులో ఇంకా ఏవో రహస్యాలుండవచ్చుననిపిస్తోంది" అన్నాడు.

"వీళ్ళు యీ కర్మకాండ ముగించేలోపల మనం వీళ్ళ అంతు చూడకపోతే మనందర్నీ యిదే విధంగా ఆ విగ్రహానికి బలిచ్చేయటం ఖాయం! అసలే వీళ్ళలో ముగ్గుర్ని చంపేశాం! ఆ కసితోనే వాళ్ళు మా లవకుశుల్ని దారుణంగా తలలు నరికి బలిచ్చేశారు! రక్తానికి రక్తం, ప్రాణానికి ప్రాణం బలి తీసుకుంటాడీ శర్మ! వీళ్ళు ఎన మండుగుర్నీ యిదే విగ్రహానికి బలిచ్చేవరకు నాకు మనశ్శాంతి లేదు!" శర్మ మాటలు ఎంతో నెమ్మదిగా వినిపించినా, అందులోని వజ్రసరి కల్పం అందరి మనసుల్నీ మంచులా తాకింది.

అందరు మళ్ళీ రాళ్ళ సందునించి లోపలకి చూశారు. అంతకంతకూ వాళ్ళ మంత్రోచ్ఛారణ తారస్థాయి నందుతోంది. అందరు పూనకంపట్టిన వాళ్ళలా గెంతుతూ, ఎగురుతూ, తుళ్ళుతూ ఈ లోకంకాని మరేదో లోకంలో అర నిమీలిత నేత్రాలతో దేనినో చూస్తున్నారు.

శర్మ చకచక దారితీశాడు. అతని వెనకనే కార్తీక్ బృందం కదిలారు.

రెండో రాతిగది ప్రవేశించారు. అక్కడ నేలమీద జింక చర్మాలు పరచబడున్నాయి. కొన్ని పుర్రెలు, చేతి ఎముకలు పోగుపడి వున్నాయి. సింధూరం, కుంకుమ రాశులు పోసివున్నాయి. అదో చిన్నసైజు స్టోరురూంలా వుంది!

మూడో గదిలోకి ప్రవేశించారు.

అక్కడ ఏవేవో ఏళ్ళు, గుర్తు తెలీనివి పేరు తెలీనివి గుట్టలుగా పడున్నాయి. రకరకాల పువ్వులు, రంగురంగుల పువ్వులు — యివే రకం పూలు కాళికా విగ్రహంవద్ద కూడా వున్నాయి.

నాలుగో గదిలోకి ప్రవేశించారు.

అక్కడ వాళ్ళూహించినట్టే మాంత్రికుడి అనుచరులు తమవద్దనుంచి స్వాధీనం చేసుకున్న తుపాకీలు రెండు, రివాల్వర్ ఒకటి, లకుకుశలవద్ద నుంచి తీసుకున్న బులెట్ల బెల్టు అన్నీ అలాగే చెక్కుచెదరకుండా ఓ పక్కగా పెట్టి వున్నాయి.

వర్మ ఒక్క అంగలో తన రివాల్వర్ అందుకున్నాడు. లవకుశుల తుపాకులు రెండూ తీసి కార్తీక్ కి, అశ్వనికి అందించాడు. అశ్వని బుల్లెట్లున్న బెల్టు తీసుకుని నడుముకు కట్టుకున్నాడు.

వర్మ చకచక రివాల్వర్ లోడ్ చేసుకున్నాడు.

అశ్వని తన చేతిలోని తుపాకీ లోడ్ చేసుకుని, రెండు గుళ్ళు కార్తీక్ కందించాడు. కార్తీక్ తన చేతిలోని తుపాకీ లోడ్ చేసుకున్నాడు.

వర్మ అందరివంకా చూశాడు. "మీరందరూ నా వల్ల చిక్కుల్లో పడిపోయినందుకు నాకు బాధగా వుంది! మీరు ఎక్కడైనా దాక్కుని వుంటే, నేను పోయి వాళ్ళను చంపేసి వస్తాను" అన్నాడు.

కార్తీక్ వెంటనే అందుకుని, "మా ప్రాణాలు ఎప్పుడో పోవలసింది—మీ వల్ల రక్షింపబడ్డాయి! అంటే యీ ప్రాణాలు మీకన్న మాట! మీ కోసం ఏం చెయ్యమన్నా సిద్ధంగా వున్నాం!" అన్నాడు.

తక్కినవాళ్ళు అవునన్నట్టు తల ఊపారు.

వర్మ నవ్వి "థాంక్యూ వెరీమచ్! మీ అభిమానానికి చాలా కృతజ్ఞుణ్ని!" అన్నాడు.

* * *

అందరూ గుహలాంటి ఆ రాతిగది నుండి బయిటికి

వచ్చారు. మాంత్రికుడు, అనుచరులు వున్న మొదటి గది వైపు వేగంగా దూసుకుపోయారు. వాళ్ళతో నడవలేక దీప్తి వెనకబడుతుంటే కార్తీక్ రెండడుగులు వెనకగా వుండి, ఆమెను జాగ్రత్తగా నడిపించుకు వెళ్ళాడు.

సరిగ్గా అదే సమయంలో నలుగురు అనుచరులు చేతుల్లో ఎముకలు, శూలాలు ధరించి తమ నిడివరలో బంధించిన రాతిగదివైపు నడుస్తూ వెళ్ళటం వాళ్ళకు కనిపించింది.

శర్మ ఆగి అందరివంకా చూపులు సారించి, "వాళ్ళు మన కోసమే వెళ్తున్నారు! మన దగ్గర ఆయుధాలు లేవు కదా అని వాళ్ళ ధైర్యం! అందుకే కేవలం శూలాలు మాత్రం తీసుకుని వెళ్తున్నారు, మనల్ని పొడిచి చంపాలని!" అన్నాడు.

హిమవంత్ వెంటనే "వాళ్ళ చేతుల్లోవున్న ఎముకల సంగతి మరిచినట్టున్నారు మీరు! ఇంతసేపూ దేవీపూజలో వుంచిన ఎముకలు! వాటికి యెక్కడలేని శక్తులూ సంక్రమించి వుంటాయి. క్షుద్రశక్తుల్ని మనమీద ప్రయోగించి చంపటానికే వెళ్తున్నారు!" అన్నాడు.

శర్మ తల విదిలించాడు. "నో, అంతా ట్రాష్! ఆ ఎముకల్లో ఏ ప్రభావము, మహిమలూ లేవు. అదో రకమైన కనికట్టు విద్యలో వాళ్ళు మన అవయవాలు స్తంభింప చేస్తున్నారు. అంతే! అలా చేసి శూలాల్తో పొడిచి చంపుతారు, అందుకే ఆ శూలాలు!...." అన్నాడు.

అభిలాష్ యేదో చెప్పబోయి కార్తీక్ సంజ్ఞ చేయటంతో ఆగిపోయాడు.

"మనం వెనకనుంచి వాళ్ళని కాల్చేద్దాం" అన్నాడు

వర్మ రివాల్వర్ గురి చూసుకుంటూ.

కా ర్తీక్ కూడా తుపాకీ సరిచూసుకున్నాడు. అశ్విని అంతకు ముందే సిద్ధంగా వున్నాడు.

అనుచరులు రాతి గదిని సమీపించబోతున్న సమయంలో ఒక్కసారిగా వెనుకనుంచి కార్తీక్, వర్మ, కాల్పులు సాగించారు.

అనుచరులు యీ దాడి నెదుర్కోవటానికి సిద్ధంగా లేరు. పెద్దగా చావుకేకలు పెడుతూ నేలమీద పడి పోయారు నలుగురూ.

రివాల్వర్ చప్పుళ్ళకి తక్కిన ముగ్గురు అనుచరులు గది లోపల్నుంచి తొంగి చూశారు. వెంటనే తలలు లోపలకు తప్పుకోవటం అశ్విని దృష్టిలో పడింది!

"వాళ్ళు చూశారు. మాంత్రికుడితో పాటు నలుగురు మిగిలారు. వాళ్ళు తప్పించుకు పారిపోయే లోపల మట్టుబెట్టాలి. హారియప్....!" అంటూ పరుగెత్తాడు అశ్విని!

వర్మ, కార్తీక్ కూడా పరుగులు పెట్టారు మాంత్రికుడి గదివైపు! కార్తీక్ పరుగెడుతూనే అభిలాష్‌ని హిమవంత్‌ని, దీపిని రావద్దని సైగ చేశాడు. వాళ్ళు రాతి గదివద్దే ఆగిపోయారు.

అశ్విని ముందుగా మాంత్రికుడి గదిలోకి ప్రవేశించాడు. ఆ వెనుకనే వర్మ, కార్తీక్ ఆయుధాలతో ప్రవేశించారు.

కాని గదిలో ఎవరూ కనిపించలేదు.

నిలువెత్తు కాళికా విగ్రహం నాల్కలు చాచుకుని భయంకరంగా కనిపిస్తోంది!

అక్కడ లవుడి, కుశుడి మొండేలు గాని తలలు గాని

లేవు!

అశ్వని, కార్తీక్, వర్మ ఆశ్చర్యంగా గది మధ్యలో నిలబడి చూస్తున్నారు. వాళ్ళ చేతుల్లో ఆయుధాలు ప్రమాదాన్నెదుర్కోవటానికి సిద్ధంగా వున్నాయి.

కాని శత్రువుల జాడే లేదు!

* * *

ఎంతసేపటికీ వెళ్ళినవాళ్ళు తిరిగి రాకపోవటంతో అభిలాష్, హిమవంత్ రాతి గదివద్ద కాళ్ళుగాలిన పిల్లుల్లా తిరుగుతున్నారు. దీప్తి బాగా బెదిరిపోయింది. వాళ్ళిద్దరి వైపు బేలగా చూస్తోంది.

ఆమెని చూస్తుంటే వాళ్ళిద్దరికీ బాగా జాలేసింది.

“మిస్ దీప్తీ, మీ రనవసరంగా మాతో ఫాలో అయ్యారనిపిస్తోంది! అసలు సర్వేకి బయలుదేరకుండా వుంటే బావుండేది. మీ ఉత్సాహాన్ని చూసి మన ప్రొఫెసర్ బయల్దేరతీశారు. ఆయన ఉద్దేశమూ మంచిదే, మీ ఆశయమూ మంచిదే. కాని యిలా అర్ధాంతరంగా గూండాలకు, మంత్రిగాళ్ళకు చిక్కుపడి మానసికంగాను, శారీరకంగానూ బాగా నలిగిపోతున్నారు....” అన్నాడు అభిలాష్.

హిమవంత్ ఆవేశంతో చిందులు వేశాడు. “ఎలాగో రెండుసార్లు ప్రాణాలు కాపాడుకోగలిగామని సంతోషిస్తుంటే యీ వర్మ తయారయ్యాడు మన ప్రాణాలకి! ఈ పాటికి మనం వూరు చేరిపోయేవాళ్ళం. ఓ పక్క తిండితిప్పలు లేవు. దాహానికి నీరు లేదు. కంటికి నిద్ర లేదు. సుఖం, శాంతి మొదలే లేవు. ప్రతిక్షణం ప్రాణాలను అరచేత పట్టుకొని యిలా చస్తూ బతలేకపోతున్నాము....” అన్నాడు.

అభిలాష్ ఓదార్పుగా చూశాడతనివంక.

"ఎన్ననుకున్నా యేం లాభం? ప్రమాదాల సుడిగుండంలో చిక్కుకుపోయున్నాం. ఇప్పుడు సురక్షితంగా బయటపడే దారి చూసుకోవాలి!" అన్నది దీప్తి, చచ్చిన నలుగురు అనుచరుల శవాలకవంక జుగుప్సతో చూస్తూ.

అభిలాష్ చెవులు రిక్కించి విన్నాడు. మాంత్రికుడి గది దగ్గర ఎలాంటి సవ్వడీ వినిపించటంలేదు.

"హిమా, మనవాళ్ళేమయ్యారు? ఎక్కడా బుల్లెట్ శబ్దాలు వినిపించటంలేదు. అసలు ఏ విధమైన చప్పుడూ వినరావటం లేదేమిటి?" అన్నాడు.

హిమవంత్, దీప్తి తలలూపి, "అదే అంతుపట్టడం లేదు. ఈ సరికి ఆ మాంత్రికుడ్ని, అనుచరుల్ని అంతంచేసి తిరిగిరావలసిందే మరి!" అన్నారు.

అభిలాష్ అసహనంగా అటు యిటు పచార్లు చేస్తున్నాడు. ఓ పక్క నలుమూలలా చీకట్లు ముసురుకొంటున్నాయి. వాచీ చూశాడు. నాలుగు గంటలు కావస్తోంది. బయటి ప్రపంచంలో మరో రెండు గంటలకు గాని పోవని పొద్దు—అక్కడ, నాలుగింటికే చీకట్లు చిమ్మిపోతోంది.

హిమవంత్ కుదురుగ్గా నిల్చుని, "అభీ, ఏం జరిగిందో పోయి చూసివద్దామా?" అన్నాడు.

అభిలాష్ తలూపి, "మిస్ దీప్తీ, మీరు ఒక్కరూ ఇక్కడ వుండగలరా?" అన్నాడు.

దీప్తి తల అడ్డంగా తిప్పింది. "ఈ శవాల మధ్య నించోవటానికే సగం చచ్చిపోయి వున్నాను. మీరు లేకపోతే నా ప్రాణాలు నావి కావు!" అన్నది

దిగులుగా.

"ఆల్ రైట్, రండి. అంతా కలిసే వెళ్దాం!" అన్నాడు అభిలాష్ ముందుకి అడుగులు వేస్తూ.

ముగ్గురు మొండిధైర్యంతో మాంత్రికుడి గది దగ్గరకు చేరుకుని బయటి నుంచే, రాళ్ళ మధ్య కంతల ద్వారా చూశారు.

లోపల ఎవరూ లేరు!

మాంత్రికుడు గాని, ముగ్గురు అనుచరులు గాని లేరు సరి కదా, వర్మ, అశ్వని, కార్తీక్ కూడా లేరు!

నిలువెత్తు కాళికా విగ్రహం మాత్రం నాల్కలు చాచుకొని భయంకరంగా కనిపిస్తోంది.

* * *

"ఇదేదో ఎత్తుగడలాగా వుంది. ఏ పక్క నుంచో దాడి చేయబోతున్నారని నా నమ్మకం!" మెల్లగా గొణిగాడు వర్మ.

అశ్వని చెవులు రిక్కించి విన్నాడు.

గాల్లో ఏవో అర్థం తెలీని శబ్దాలు చాలా నెమ్మదిగా జాగ్రత్తగా వింటేనేగాని వినిపించనంత నెమ్మదిగా కర్ణపుటాలని తాకుతున్నాయి.

అంతకు మించి వాతావరణంలో చెప్పుకోదగ్గ విశేషమేమీ కనిపించలేదెవరికీ!

కార్తీక్, అశ్వని తుపాకుల్ని కుదురుగా పట్టుకుని వున్నారు! ఏ పక్కనుంచి శత్రువులు దాడి చేసినా కాల్చెయ్యటానికి సిద్ధంగా వున్నారు.

"ఇక్కడ ఏదైనా నేలమాళిగ వుందేమో....!" అనుమానం వెలిబుచ్చాడు అశ్వని.

కార్తీక్ ఆశ్చర్యంగా చూసి, నేలమాళిగలో మరో

నేలమాళిగా? నువ్వు చెప్పేది వింతగా వుంది!" అన్నాడు.

వర్మ రివాల్వర్ పట్టుకుని కాళికా విగ్రహం వెనక పక్కకు వెళ్ళాడు. అక్కడ ఎవరైనా దాక్కుని వున్నారేమోనని అతని వూహ నిజంకాలేదు.

కార్తీక్ యీ లోపల నేలమీద రక్తపు టడుగులు గమనించాడు. అవి సరాసరి పక్కనున్న రాతి గదిలోకి దారి తీస్తున్నాయి.

వర్మవైపు తిరిగి, "అదిగో అడుగు జాడలు! కింద శవాల్ని యీడ్చుకుపోయిన చిహ్నంగా పొడుగ్గా రక్తపు ధారా చూశారా?" అన్నాడు.

వర్మ పరీక్షగా చూసి "ఎస్! మనం వచ్చేలోపల, పక్క గదిలోకి శవాల్ని యీడ్చుపోయారన్న మాట! బి ఎలర్ట్. పక్క గదిలోకి వెళ్ళి చూద్దాం!" అన్నాడు.

రాతి తలుపు తొలగించి, ముగ్గురు ఆయుధాలు సరిగా పట్టుకుని, చుట్టూ పరికించి చూస్తూ పక్క గదిలోకి వెళ్లారు.

గది పూర్తిగా ఖాళీగా వుంది.

అంతక్రితం తాము చూసిన పుర్రెలు, ఎముకలు, జింక చర్మాలు—ఏవీ లేవక్కడ!

ముగ్గురు ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచారు!

అక్కడ నేలమీద శవాల్ని యీడ్చుకుపోయా రన టానికి నిదర్శనంగా రక్తపు జాడలు, అడుగు జాడలు వున్నాయి!

ఒకరినొకరు ఆశ్చర్యంగా చూసుకున్నారు.

ఇదివరలో యిలా ఒక గదిలోనుంచి మరో గదిలోనికి

దారి వున్నట్టు తాము గమనించలేదు. రాతి పలకతో కట్టిన గదులే కాబట్టి, అవసరార్థం వాటిలో కొన్నిటిని తొలగించి దారి చేసుకుని పక్క గదుల్లోకి ప్రవేశిస్తూ వెళ్ళారు.

తీసి వేసిన రాతి పలకలు చిందర వందరగా పడు న్నాయి!

మూడో గదిలోకి వెళ్ళారు.

అక్కడ మాత్రం పూలు, పళ్ళు గుట్టలుగా పడి వున్నాయి. తామిదివరకు చూసినవే! పక్క గదిలోనికి కూడా రక్తపుజాడలు స్పష్టంగా కనిపించాయి.

నాలుగో గది—తమ ఆయుధాలు దాచి పెటబడిన గది ప్రవేశిస్తూనే ముగ్గురు ఆయుధాలు గురిపెట్టికాల్చారు. కాని గుళ్ళు బయటికి రాలేదు.

కంగారుగా మళ్ళీ మళ్ళీ ట్రిగ్గర్ మీద వేళ్ళుంచి నొక్కబోయారు. కానీ వాళ్ళ చేతులు సహాకరించలేదు. వేళ్ళు వంగలేదు.

ఎదురుగా ముసలి మాంత్రికుడు భయంకరాకారంతో నిప్పులు కక్కుతున్న చూపుల్తో, కుడిచేతిలో ఎముక పట్టుకొని గాల్లో ఊపుతూ ఏదో స్మరిస్తున్నాడు.

పక్కనే ముగ్గురు అనుచరులు వున్నారు!

* * *

"చిత్రంగా వుందే! గదిలో యెవరూ లేరు. కనీసం మనవాళ్ళు ఎవరూ కనిపించరే....!" అన్నాడు హిమ వంత్ ఆశ్చర్యాన్నణచుకుంటూ.

అభిలాష్, దీప్తి కూడా అదే అయోమయ స్థితిలో వున్నారు! అంత క్రితం మాంత్రికుడు లవకుశుల్ని బలిచ్చిన

సూచనలు కూడా అక్కడ కనిపించటం లేదు. ఏమీ జరగనట్టే అతి ప్రశాంతంగా వుంది వాతావరణం!

"లోపలికి పోయి చూద్దామా?...." అన్నాడు అభిలాష్.

హిమవంత్ తలూపి, "నిండా మునిగాక చలేమిటి? ఇదేమిటో తేల్చుకునే పోగాం. మనవాళ్ళేమైపోయారో, ఈ రాతి గదుల్లో ఎక్కడ మిస్సయ్యారో, ఆ మాంత్రికుడు, వాడి అనుచరుల సంగతేమయిందో, అంతా విచిత్రంగా కనిపిస్తోంది!" అన్నాడు.

అభిలాష్ దీప్తితో "రండి, లోనికి వెళ్ళి చూద్దాం!" అన్నాడు వాడిగా. ఆమె బయల్దేరింది వాళ్ళ వెంట.

అభిలాష్ మాంత్రికుడి గదిని పరీక్షగా చూశాడు. రక్తపు జాడలు కనిపించాయి. అతని భ్రుకుటి ముడి పడింది.

దీప్తివంక సాభిప్రాయంగా చూశాడు. ఆమె కూడా ఆ రక్తపుజాడల్ని పక్క గదిలోకి అవి దారి తియ్యటం గమనించింది.

అభిలాష్ విగ్రహం చెంత వున్న శూలాలు గమనించాడు. రెండు శూలాలున్నాయి. అంత క్రితం నలుగురు అనుచరులు నాలుగు శూలాలు తీసుకుని తమను చంపేందుకు పోయి చచ్చారు!

అభిలాష్ అవి రెండూ అందుకుని ఒకటి హిమవంత్ కిచ్చాడు. "ప్రస్తుతానికి ప్రాణరక్షణకు యింతకన్న వేరే ఆయుధాల్లేవు. పక్క గదిలోకి పోదాం, పదండి!" అన్నాడు.

ముగ్గురు పక్క గదిలోకి వెళ్ళారు. అక్కడా ఎవరూ లేరు. మూడో గదిలో పూలు, పళ్ళరాశులు కనిపించాయి.

సాలుగో గదిలోకి ప్రవేశించబోయి చటుక్కున ఆగి-పోయాడు అభిలాష్. అతని వెనకనే హిమవంత్, దీప్తి ఆగిపోయారు.

ఆ గదిలో మాంత్రికుడు, అతని అనుచరులు నించుని వున్నారు. ఎదురుగా చేష్టలుడిగి చేత రివాల్వర్తో వర్మ, తుపాకులతో కార్తీక్, అశ్విని కదలకుండా అచేతనంగా నిలబడి వున్నారు. నేలమీద అడ్డదిడ్డంగా మొండేలు, తలలు పడివున్నాయి. అవి లవకుశల కళేబరాలు!

వాటిని పరీక్షగా చూసి తుళ్ళిపడ్డాడు అభిలాష్. లవుడి శరీరానికి కుశుడి తల, కుశుడి శరీరానికి లవుడి తల అమర్చబడి వున్నాయి.

గాల్లో వింత శబ్దాలు—సంయ్ మంటూ గాలిని కోస్తూన్న సవ్వడి. వింత అలజడి!

మెట్లదగ్గిర నేలమాళిగవద్ద సరిగ్గా ఇదే శబ్దాలు వినిపించాయి.... అప్పుడే మాంత్రికుడ్ని తను సంహరించాడు!

మాంత్రికుడు అనుచరులవంక చూసి కళ్ళతోనే ఏదో సైగ చేశాడు.

అనుచరులు ముగ్గురు గోడకి చేర్చి వున్న మూడు శూలాలు చేతుల్లోకి తీసుకున్నారు. అంతవరకు రక్తంతో ముగ్గు వేసివున్న వలయంలో వుంచిన ఎముకల్ని ఒక్కొక్కటి తీసుకున్నారు.

ఓ చేతిలో ఎముక, మరో చేతిలో శూలం ధరించి బయటికి వెళ్ళారు.

అభిలాష్ హిమవంత్ ని మోచేత్తో పొడిచాడు. హిమవంత్ కి అర్థమైంది. వాళ్ళు ముగ్గురు తమకోసమే వెళ్తున్నారు! వాళ్ళ ముఖాల్లో ప్రతీకార జ్వాల రగలటం

స్పష్టంగా కనిపిస్తోంది. తమ సహచరుల్ని చంపినందుకు గాను తమందర్నీ క్షుద్ర దేవతలకు బలివ్వబోతున్నారన్న విషయం తెలుస్తూనే వుంది! తాము ముగ్గురు లేకపోవటం చూసి మాంత్రికుడు తమకోసం ఆ ముగ్గురు అనుచరుల్ని పంపిస్తున్నాడు!

అభిలాష్, హిమవంత్ ఏ మాత్రం ఆలస్యం చెయ్య లేదు. ఒక్కసారిగా ఆ గదినుండి బయిటికివచ్చారు. ముగ్గురు అనుచరులు మహోద్రేకంతో రాతిగదివైపు సాగిపోతు న్నారు.

అభిలాష్, హిమవంత్ వెనకపాటుగా యే మాత్రం చప్పుడు కాకుండా అనుచరుల వెనకగా వెళ్ళారు. వెనక నుంచి శూలాలతో యిద్దరు అనుచరుల్ని పొడిచే శారు.

ఊహించని యీ హఠాత్సంఘటన వాళ్ళు యెదురు చూడనిది! చావు కేకలు పెడుతూ నేల కూలారు వా ళ్ళిద్దరు.

మూడోవాడు దిగ్భ్రమతో వారివంక తిరిగాడు. అంతే! యిద్దరూ ఒక్కసారిగా తమ శూలాల్ని అతని గుండెల్లోకి దించేశారు. చేతిలో ఎముకని గాల్లో ఊపా లనుకున్నాడు—కాని అతని ప్రయత్నం సగంలోనే ఆగిపోయింది.

నేలమీద ముగ్గురు గిలగిల కొట్టుకున్నారు కాసేపు. మరో రెండుసార్లు పొడిచారు అభిలాష్, హిమవంత్— వాళ్ళ గుండెల్లో!

ఆ తర్వాత యింకేమీ ఆలస్యం చెయ్యలేదు వా ళ్ళిద్దరు. మాంత్రికుడు, తమవాళ్ళు వున్న గది దగ్గరకు పరుగెత్తారు. దీప్తి ఆత్రుతగా చూస్తోంది వారివంక.

గాల్లో వింత శబ్దాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. పక్కనే యెవరో తిరుగాడుతున్నట్టు, ఏవేవో మాట్లాడు న్నట్లు రణగొణ ధ్వనులు వినిపిస్తున్నాయి—

కింద పడున్న కళేబరాల్లో కదలిక వస్తున్నట్టుగా అవి అటు యిటు కదిలాయి.

దీప్తి ఆ దృశ్యం చూడలేనట్టు కళ్ళు మూసుకున్నది. వర్మ, కార్తీక్, అశ్విని బొమ్మల్లా అలాగే నిల్చుని వున్నారు. వాళ్ళలో ఏమాత్రం చలనం లేదు.

మాంత్రికుడి చేతిలో ఎముక గాల్లో ఆడుతూనే వుంది. క్షుద్ర దేవతల హడావిడి మరింత స్పష్టంగా తెలుస్తోంది. మాంత్రికుడి పెదాలు మంత్రాల్ని ఉచ్ఛరిస్తూనే వున్నాయి మౌనంగా.

మాంత్రికుడి కుడిచేయి కిందపడున్న పొడవాటి కత్తిని చేతిలోకి తీసుకుంది. ఎడమ చేతిలో ఎముక గాల్లో ఆడూనే వుంది. కుడిచేయి గాల్లోకి లేపాడు. కత్తితో లవుడ్ని కుశుడ్ని ఖండ ఖండాలుగా నరికాడు. కళేబరాలు నుజ్జు నుజ్జుగా ముక్కలు చేస్తూంటే వర్మ, కార్తీక్, అశ్విని—ముగ్గురిలోను ఎలాంటి చలనం లేదు గాని అభిలాష్, హేమవంత్, దీప్తి ఆ దారుణకృత్యం చూడలేనట్టు కళ్లు మూసుకున్నారు.

మాంత్రికుడి కసి అంతా అతని యీ చర్యలోనే వాళ్ళకి బాగా తెలిసివచ్చింది.

మాంత్రికుడు వర్మ దగ్గర కొచ్చాడు. ఎడమ చేత్తో అతని శిరస్సు వంచాడు. కుడిచేతిలోని కత్తి మరుక్షణం అతని శిరస్సుని నరికి వుండేదే!

కాని అభిలాష్ మెరుపులా దాడిచేశాడు మాంత్రికుడి మీద. ఈసారి అతని గురి తప్పలేదు. సరాసరి మాంత్రి

కుడి గుండెల్లోకి దించేశాడు. వెనుకనుంచి హిమవంత్ తన శూలాన్ని మాంత్రికుడి వెన్నున పొడిచాడు—ఒకసారి కాదు, ఎన్నోసార్లో!

మాంత్రికుడి నోట్లోని మంత్రాలు ఆగిపోయాయి.

మహాపర్వతంలా నేలమీద కూలిపోయాడు. కాని చావలేదు. ఇంకా అతని చేతిలోని ఎముక గాల్లో ఊగు తునే వుంది. అభిలాష్ ఆ ఎముకని చటుక్కున లాగే శాడు.

ఒక్కసారిగా గాల్లోని శబ్దాలు ఎక్కడికక్కడ ఆగి పోయాయి. వర్మ, కార్తీక్, అశ్విని ఒకేసారి ప్రాణం వచ్చిన బొమ్మల్లా కదిలారు.

*　　　*　　　*

అభిలాష్ మాంత్రికుడి ముందు గొంతుకూర్చున్నాడు. మాంత్రికుడు ఏదో చెప్పాలని ఆత్రుతపడుతున్నట్టు కని పించింది.

"ఏమిటి, ఏం కావాలి?" అనడిగాడు అభిలాష్.

మాంత్రికుడికి అంతిమ క్షణాలు దగ్గర పడ్డాయని గ్రహించా రందరు.

వర్మ, కార్తీక్, అశ్విని, హిమవంత్, దీప్తి—మాంత్రి కుడి పక్కగా చేరారు.

మాంత్రికుడి నోటినుంచి యేలాంటి శబ్దమూ రాలేదు కాసేపు.

అభిలాష్ పక్కనే వున్న పాత్రలో నీళ్ళుండటం చూసి, పాత్రందుకొని నీళ్ళు మాంత్రికుడి నోట్లోకి వంచాడు.

మాంత్రికుడు నోరు చప్పరించి, "నిధి.... వేల కోట్ల రూపాయల నిధి...." అంటూ గొణిగాడు.

వర్మ కళ్లు పెద్దవయ్యాయి.

"ఎక్కడ? యెక్కడ ఆ నిధి? వెంటనే చెప్పు?" అన్నాడు.

మాంత్రికుడు చేయి యెత్తి దూరంగా చూపించాడు. అక్కడ్నుంచి పచ్చటి వెలుగు కనిపిస్తోంది! చీకటి బాగా కమ్ముకోవటంవల్ల ఆ వెలుగు మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

వర్మ మాంత్రికుడ్ని పట్టి కుదుపుతూ, "చెప్పు, ఎక్కడ దాచావో చెప్పు వేగం!" అన్నాడు.

మాంత్రికుడు పెదాలు కదిపాడు. కాని మాట బయిటికి రాలేదు.

అతని కళ్ళు వాళ్ళవంకే చూస్తున్నాయి—కాని ఆ కళ్ళలో జీవం లేదు. అతని ప్రాణవాయువులు అనంత వాయువుల్లో లీనమై ఎంతోసేపు కాలేదు!

వర్మ పదేపదే మాంత్రికుడ్ని చూశాడు.

"చచ్చాడు, విషయం పూర్తిగా చెప్పకుండానే చచ్చాడు!" వర్మ పళ్ళు నూరాడు.

అభిలాష్‌వంక చూసి, "అనవసరంగా చంపేశావు వీడ్ని! వీడివల్ల చాలా ఉపయోగకరమయిన సమాచారం తెలియవలసింది తెలియకుండా పోయింది! మరీ అంతగా పొడిచి చంపకపోతే నేం?" అన్నాడు కోపంగా.

అభిలాష్ కోపం తెచ్చుకోలేదు, "వాడేం చెప్పేవాడో తర్వాతి సంగతి! మేము ఆలస్యం చేస్తే మీ ముగ్గుర్ని యీపాటికి స్వర్గానికి పంపివుండేవాడు! ఒకసారి వీడ్ని సగం ప్రాణాలతో వదిలేసినందుకే యింత చేశాడు. మరోసారి అదే పొరపాటు రానిస్తానా?" అన్నాడు.

"సంతోషించాం తెలివికి!" ఉక్రోషం ధ్వనించింది వర్మ గొంతులో. అందరూ ఆశ్చర్యంగా చూశారు అతని వంక.

కార్తీక్ అన్నాడు: "ఏమిటి వర్మగారూ! నిధి అంటున్నాడు మాంత్రికుడు! ఇక్కడ నిధి వుండట మేమిటి?"

అందరికీ కార్తీక్ కావాలనే ఆ ప్రశ్న వేస్తున్నాడని తెలుసు. ఇక్కడ యేదో నిధి నిక్షేపాలున్న సంగతి, కళ్యాణవర్మ ఒకప్పుడు వాటిని యిక్కడ నిక్షేపించిన సంగతి గతంలో రాక్సన్ వాళ్ళకు చెప్పి వున్నాడు. అందుకే టైగర్ హిల్స్ మీద తవ్వకాలు జరిగాయి. రెండో బేచ్ కూడా అందుకే తవ్వటం జరిగింది. అయితే యింతకీ యిన్ని ప్రాణాల్ని బలి తీసుకున్న ఆ నిధి ఉన్న చోటెక్కడ? అందరిలోనూ యిదే ప్రశ్న!

వర్మ అంత ఖచ్చితంగా నిధి విషయం అన్ని వివరాలు ఎందు కడుగుతున్నాడు? నిధి విషయం అతనికి ముందే తెలుసా?

తేలుకొండీల్లాంటి ప్రశ్నలు!

కార్తీక్ ప్రశ్న అందరికీ ఆసక్తి కలిగించింది. వర్మ ఏం సమాధానం చెపుతాడా అని చెవు లప్పగించి చూస్తున్నారు.

అయితే వర్మ ఏమీ సమాధానం చెప్పలేదు.

కార్తీక్ రెట్టించలేదు.

అశ్వని నోరు విప్పాడు. "వర్మగారూ, యిక తిరిగి వెళ్ళిపోదామా? చీకటి పడిపోయింది. ఈ శవాల మధ్య జాగారం దేనికి?"

వర్మ దీనికి వెంటనే సమాధానం చెప్పలేదు.

"ఏం భయంగా వుందా?" అన్నాడు కాసేపటికి.

"ఆకలితోను, దాహంతోను కొంపొచ్చినట్టుంది. భోంచేసి రెండురోజు లయింది. మా పరిస్థితి గమనించే వుంటారు. పళ్ళ బిగువున ఇప్పటిదాకా నెగ్గుకొచ్చాం!" అన్నాడు హిమవంత్.

అతనికి వర్మమీద పీకదాకా కోపం వుంది. అతని మూలాన్నే తామీ మాంత్రికుడి మాయలో పడి కొట్టుకోవలసి వచ్చినందుకు వర్మ పట్ల గుర్రుగా వున్నాడు.

"ఇంతదాకా వచ్చి వెనక్కి పోవటం దేనికి? మాంత్రికుడు యేదో నిధి అంటున్నాడు కదా, చూసి పోదామా?" అన్నాడు వర్మ అందరివంకా పరీక్షగా చూస్తూ.

"ఆ మాంత్రికుడు చావబోతూ సంధిప్రేలాపన ఏదో చేసి వుంటాడు. ఈ దిక్కుమాలిన గుహల్లో నిధులు, నిక్షేపాలు కూడానా?" అన్నాడు హిమవంత్ తీసిపారేస్తున్నట్టు.

"నిధులు—నిక్షేపా లుండేది యిలాంటి మనుష్య సంచారంలేని ప్రదేశాల్లోనే! ఈ మాంత్రికుడు, వీడి అనుచరులు ఆ నిధికోసమే యిక్కడ కాపలా వుండివుంటారు. మనం రావటంతో వాళ్ళ కార్యకలాపాలకు అంతరాయం కలిగింది!"

"మనం వచ్చేదాకా యిక్కడ తీరిగ్గా పూజలు, పునస్కారాలు యెందుకు చేసుకుంటున్నారు? క్షుద్రదేవతల నెందుకు ఉపాసిస్తున్నారు? ఆ నిధి యేదో తవ్వుకుని పోవచ్చును కదా!...." హిమవంత్ లా పాయింటు

తీశాడు.

"ఆ నిధి అంత తొందరగా చిక్కుతుందా? దాని కోసమే వీళ్ళు క్షుద్రదేవతల నారాధిస్తూ, బలులతో, పూజలతో కాళీమాతను ప్రసన్నం చేసుకుంటూ వుండి వుండొచ్చు!"

"అంటే వీళ్ళకూడా ఆ నిధి ఎక్కడుందో తెలీదు. దాన్ని చేజిక్కించుకోవటం కోసమే పూజలు చేస్తున్నారు. అవునా?"

"అదే అయివుంటుంది" అన్నాడు వర్మ.

"మీకీ పూజల పట్ల, మాయలు మంత్రాల పట్ల ఇప్పటిదాకా నమ్మకం లేదుకదా!" చురక తగిలించాడు హిమవంత్.

వర్మకి యిట్టే కోపం వచ్చేసింది. "నేను వచ్చినప్పట్నుంచీ చూస్తున్నాను. నువ్వు ప్రతిదానికీ యేదో వ్యతిరేకంగా మాట్లాడుతూనే వున్నావు!" అన్నాడు.

కార్తీక్ వాతావరణాన్ని తేలికపరచాలని వాళ్ళ మధ్య కలగజేసుకొని, "వర్మగారూ, మీ కతనితో వాదన దేనికి? ఊరుకోండి.... చెప్పండి యేం చేద్దామంటారు? మా పరిస్థితి మీకు బాగా తెలుసు! ఈ రోజు ఉదయం యీ గుహల్లోకి అడుగుపెట్టక పోయివుంటే చింతపల్లె వెళ్ళి అక్కడ్నుంచి మా వూరు వెళ్ళిపోయుండే వాళ్ళం! మాకు ఓపిక, సహనం పోయాయి. బాగా నీరసం, నిస్పృహలు ఆవరించాయి. ఎంత తొందరగా బయటపడదామా అని ఆత్రంగా వుంది. ఇదీ మా పరిస్థితి!" అన్నాడు.

వర్మ ప్రసన్నంగా చూశా డతనివంక. "ఇప్పుడు బయటకి పోవటం చాలా కష్టం కదా! కన్ను పొడుచు

కన్నా యేం కనిపించటంలేదు. దార్లో ఎలాంటి విష పురుగులున్నాయో, ఇంకా ఎలాంటి మంత్రగాళ్ళున్నారో! ఈ విషయాలేవీ మనకు తెలియదు. ఈ ప్రదేశం ఉదయం నించీ మనకు అలవాటయిన చోటే కదా! ఈ రాత్రికి ఎలాగో యిక్కడ గడిపేద్దాం. తెల్లవారాక తిరుగు ప్రయాణం చేస్తే బావుంటుంది. ఈ గుహల్లోంచి బయట పడ్డా టైగర్ హిల్స్ మీద నే వుండిపోవాలి. దిగలేం కదా! ఏమంటారు?" అన్నాడు.

"మరి ఆకలి బాధో....?" అశ్విని అడిగాడు.

"ఇందాకా ఓ రాతిగదిలో పళ్ళు చాలా చూశాం కదా! అవి తిని ఆకలి బాధ తీర్చుకుందాం!" అన్నాడు వర్మ.

"అవి యేం పళ్ళో? యిప్పుడూ చూసిన రకంలాగా లేవు. అవి తినవచ్చో, లేదో...."

"నో, నో! అవి తినేపళ్ళు కాకపోతే యీ మంత్రగాళ్ళు ఎందుకు దాచుకుంటారు? ఈ ప్రాంతాల వాళ్ళకు యేవీ దొరక్క యీ పళ్ళే ఆహారంగా తీసుకుంటున్నారని నా అభిప్రాయం!"

అందరిలోనూ ఆకలి తన ప్రతాపాన్ని చూపిస్తోంది.

"ఆల్ రైట్, పదండి!" అంటూ లేచారు.

మూడో రాతిగదిలో పళ్ళు, పూలు వున్న చోటికి చేరుకొన్నారు.

* • *

ముందుగా వర్మ కొన్ని పళ్ళు తీసి రుచి చూశాడు. బాగానే వున్నాయనిపించింది.

"తినండి, బాగానే వున్నాయి!" అన్నాడు.

"అంతా చీకటి! అవి ఎక్కడున్నాయో కూడా కని

పించటంలేదు!" అన్నాడు హిమవంత్.

"ఎక్కడినుంచో గుడ్డి వెలుగు పడుతోంది, అదుగో" అన్నాడు అశ్విని.

"అది కాళికా విగ్రహమున్న రాతిగదినించి. అక్కడ కాగడాలు పెట్టి వుంచారు. వాటి వెలుగే ఇక్కడిదాకా ప్రసరిస్తోంది!" అన్నాడు కార్తీక్.

"అలాగా! అయితే యీ రాత్రికి మనం ఆ రాతి గదిలో అమ్మవారి సన్నిధిలో గడిపేద్దాం. ఉదయం మాత్రం యెట్టి పరిస్థితుల్లోను యిక్కడ వుండొద్దు. ఇప్పటికి జరిగిన దారుణాలు, ఘోరాలు చాలు!" అన్నాడు హిమవంత్.

కార్తీక్ దీపికవంక చూసి, "తీసుకోండి. ఏదో యింత యెంగిలిపడక తప్పదు కదా! ఇదే మన పాలిట పంచభక్ష్య పరమాన్నాలు!" అన్నాడు కొన్ని పళ్ళు ఆమె కిస్తూ.

దీపి అంతదాకా పెదవి విప్పకుండా మౌనంగా వాళ్ళను అనుసరిస్తూ వచ్చింది. ఆమె మెదడు మొద్దుబారి పోయింది. జరిగిన దుస్సంఘటనలు ఆమె లేతమనసు మీద బలమయిన ముద్రలు వేశాయి. అదో రకమైన జడత్వం ఆవరించింది మనసంతా.

మౌనంగా అత నందించిన పళ్ళు తీసుకున్నదే గాని తినటానికి మనస్కరించలేదు.

ఓ పాత్రలో యేదో ద్రవపదార్థం కనిపించింది. అశ్విని ఆ పదార్థాన్ని పరిశీలనగా చూశాడు. తర్వాత వేలు ముంచి నాలికపై పెట్టుకుని రుచి చూశాడు.

"అరె పుట్టతేనె! చాలా ప్రశస్తంగా వుంది. వీళ్ళు యేర్పాట్లు బాగానే చేసుకున్నారు ...రండి, తలా కాస్త

తాగుదాం!" అన్నాడు.

హిమవంత్, అభిలాష్ కూడా రుచి చూశారు. తక్కిన ముగ్గురు ఆసక్తి చూపించలేదు.

అందరూ మళ్ళీ మాంత్రికుడి గది సమీపంలో నడుములు వాల్చారు. గదిలోనికి వెళ్ళటానికి ఎవరికీ యిష్టం లేకపోయింది. ఆ గదిలో ఎన్ని జీవాలు మూగగా బలైపోయాయో తల్చుకుంటే అందరికీ యేదోలా వుంది. ఆ విషయాలు తల్చుకుంటేనే వాళ్ళకు జుగుప్స కలుగుతోంది.

ఒకరొకరుగా అందరూ నిద్రలోకి జారిపోయారు. బాగా అలసిపోయి వుండటంతో కాసేపట్లోనే గాఢ నిద్రలో మునిగిపోయారు.

అసలు కంటికి నిద్రలేనిది దీప్తికే! ఆమె మెదడు అనేకమయిన ఆలోచనలు భయాందోళనలు సుళ్ళు తిరుగుతున్నాయి. జరిగిపోయిన సంఘటనలు ఓ పక్క, యే ఆపదా లేకుండా బయటపడగలమా అన్న అనుమానం మరోపక్క ఆమె కంటికి కునుకు రాకుండా చేస్తున్నాయి.

ఆమె కదలికలు కనిపెట్ట గలిగినవాడు కార్తీక్ ఒక్కడే!

"మిస్ దీప్తీ!" అని పిలిచాడు నెమ్మదిగా.

దీప్తి చటుక్కున కళ్ళు తెరిచి చూసింది. చీకటికి అలవాటు పడ్డ కళ్ళు పరిసరాలని బాగానే గుర్తు పడుతున్నాయి.

"మీ రెండుకో అనీజీగా ఫీలవుతున్నారు, అవునా?" అన్నాడు కార్తీక్.

దీప్తి లేచి కూచుంది. ఆమె మనసు సానుభూతికోసం,

కపించి పోతోంది.

కార్తీక్‌కి దగ్గరగా జరిగి అతని ముఖంలోకి చూసింది.

"మనం బతికి బయటపడగలమంటారా?" అన్నది బేలగా.

"మీకు ప్రాణభయం పీడిస్తున్నదా?" అడిగాడు కార్తీక్ నవ్వుతూ.

"భయం ప్రాణికి సహజం కదా! అయినా నా ఒక్క ప్రాణంకోసమైతే యింత బాధపడేదాన్ని కాదు. కాని" అర్థోక్తిలోనే ఆగిపోయిందామె.

"కాని....? చెప్పండి, ఆగిపోయారేం?"

"ముందు నన్నలా మన్నించి మాట్లాడటం మానేస్తారా, లేదా?"

"పదిమందిలో వున్నపుడు నీ మర్యాద కాపాడాలి కదా! లేకుంటే నన్ను నేను అవమానించుకున్నట్టే!"

"ఇప్పుడు పదిమంది ఎవరూ లేరు కదా....! మీరు, నేను—అంతే కదా!"

"కాని చుట్టూ అందరూ వున్నారు. వారిలో ఎంత మంది నిద్రకి పడ్డారో, ఎందరు మనల్ని పరిశీలిస్తూంటారో ఎలా చెప్పగలం?"

"ఇక్కడ పరాయి వాళ్లెవరున్నారు? మనిద్దరి విషయం మన కొలీగ్స్‌కి తెలుసు కదా! అదీగాక మనం ఊహ తెలీని పసిపాపలం కాదు. మన హద్దుల్లో మనం వుంటున్నాం, బాధ్యత నెరిగి ప్రవర్తిస్తున్నాం. అందుకే మనవాళ్ళందరికీ మనమంటే గౌరవం. అవునా....?"

"అవుననుకోండి. అయినా నాకెందుకో మన వాళ్ళందరూ వుండగా మీ వంక చూడటానికి కూడా ఎంతో బెరుకుగా, సిగ్గుగా వుంటుంది!"

"ఇరవయ్యో శతాబ్దం చివర్లో వున్నాం. ఈనాటి ఆడపిల్లలు మరీ యింత పిరికి వాళ్ళలాగా ప్రవర్తించటం నిన్నే చూశాను. ఈ రోజుల్లో ఆడపిల్లలకి కావలసింది గుండె ధైర్యంతోబాటు, శౌర్యం, ధైర్యసాహసాలు కూడా! తోడేళ్ళలాంటి పురుషులున్న యీ ప్రపంచంలో మీ రక్షణకోసం మీరే జాగ్రత్తలు తీసుకోవాలి. బొత్తిగా బేలలాగా ప్రవర్తిస్తే ఎలా? స్త్రీ అబలకాదు, సబల అని నిరూపించగలగాలి!"

"అందుకే కదా ధైర్యంగా సర్వేకి బయల్దేరి వచ్చాను మీ వెంట! మీరు నాకు తోడుంటారనే నేనీ సర్వేకి బయల్దేరాను. లేకుంటే అడుగు కదిపేదాన్నే కాదు!"

"అదిగో మళ్ళీ పిరికితనం! అగాధాల అంచుల్లోకి వెళ్ళాలన్నా, ప్రమాదానికి వెంట్రుకవాసిలో పోవలసి వచ్చినా, సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నా నువ్వు మాత్రం ధైర్యాన్ని ముఖ్యంగా మనోనిబ్బరాన్ని కోల్పో కూడదు....?"

"మీ సాహచర్యంలో నాకు అవన్నీ అలవడతాయని నా నమ్మకం! అందుకే ముందునించి అలవాటు చేసుకో లేదు" అతనికి పక్కగా జరిగి అన్నది దీప్తి.

ఆమె కళ్ళు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. మెరుపు తీసుతున్న ఆమె కళ్ళల్లోకి ప్రేమగా, ఆర్తిగా చూస్తున్నాడు కార్తీక్. ఆమె ఊపిరి అతని ముఖానికి వెచ్చగా తగుల్తోంది. తనకోసమే ఆమె బతికి వున్నదనీ, తనే ఆమె లోకమనీ తెలుచుకుంటేనే అతని ఛాతీ గర్వంతో పొంగి, ఆమెమీది ప్రేమ వెల్లువలై ఆమె గుండెల్లోకి, గుండె లోతుల్లోకి, ఆమె అంతరాంతరాల్లోకి ప్రవహిస్తోంది.

ఆమెని పొదివి పట్టుకుని మెత్తగా గుండెలకు హత్తుకున్నాడు కార్తీక్. దీప్తి అతని బాహువుల్లో మెత్తగా ఒరిగిపోయి అతని గుండెలమీద తల పెట్టుకుని నిశ్చింతగా కళ్ళు మూసుకుంది.

కొద్ది క్షణాల సాంత్వన తర్వాత, ఆమెను బుగ్గమీద సున్నితంగా తట్టి, "ఇదేమిటి, కటిక నేలకన్న యిదే బావుందని నా గుండెలమీద నిద్రపోతున్నావా?" అన్నాడు కార్తీక్. దీప్తి కళ్ళు తెరిచి సిగ్గుపడింది.

ఇద్దరు హాయిగా నవ్వుకున్నారు.

"కార్తీక్! ఎంతకాలమయింది మనం యిలా హాయిగా కబుర్లు చెప్పుకుని! ఈ సర్వేకు బయల్దేరిన వేళా విశేషమేమిటోగాని, అన్నీ ఆపదలే కొని తెచ్చుకున్నాం. మృగాల్లాంటి మనుషులు, బలులు, క్షుద్ర దేవతోపాసకులు, క్షుద్ర శక్తుల ఆగడాలు—ఓహ్, తల్చుకుంటేనే మనసంతా అల్లకల్లోలమయిపోతుంది. అసహ్యంతో ఒళ్ళు కుంచించుకు పోతుంది. శవాల మధ్య మనం ఇలా జాగరణ చేస్తూంటే మనసంతా అల్లకల్లోలమైపోతోంది!" అన్నది దీప్తి. ఆమె శరీరం సన్నగా ఒణకటం కార్తీక్‌కి తెలుస్తోంది.

"ఛీ, ఏమిటా కన్నీళ్ళు? ఇంతవరకు ధైర్యంగా కబుర్లు చెప్పి యింతలోనే.... ఎంతయినా ఆడపిల్లననిపించుకున్నావు!"

"నో, యిది భయంవల్ల వచ్చిన కన్నీళ్ళు కావు! నాకు కంటికి రెప్పలా చూసుకునే మీరున్నంతకాలం, మీ నీడలో ఎక్కడికైనా, చివరికి నరకానికైనా నేను రావటానికి సిద్ధం! మీ గుండెమీద నిశ్చింతగా వాలి ప్రాణాలు వదలటానికైనా వెనకాడను...."

"ఛీ, ఎందుకా పాడు మాటలు?" అన్నాడు కార్తీక్ ఆమె నోటిమీద చిన్నగా దెబ్బవేసి.

"తల్చుకోవటానికే మీకు మనస్కరించటంలేదు. నిజంగా నాకేదైనా జరగకూడనిది జరిగితే...."

"ఉష్, యిక మనం మాట్లాడుకోవద్దు! అప్పుడే టైం పదకొండున్నర అయింది. ఇక కాసేపు విశ్రాంతి తీసుకుందాం.... నాకు చాలా బడలికగా వుంది!" అన్నాడు కార్తీక్.

దీప్తి అతన్ని వదలేక వదిలి, "అంతా నాటకం, మహా, మీకేనేమిటి అంత నిద్రవచ్చేది? నాకూ నిద్రొస్తోంది!" అన్నది బుంగమూతి పెట్టి.

"అయితే నిద్రపో రాకుమారీ! పాట పాడనా?" అల్లరిగా అన్నాడు.

"మహానుభావా, అంత పని చెయ్యొద్దు. పాపం, మన స్నేహితులు యిప్పుడే కాస్త విశ్రాంతిగా పడుకున్నారు. వాళ్ళ సుఖాన్ని పాడుచెయ్యకండి."

"నా పాటపట్ల నీకింత ద్వేష భావం కలగటం అన్యాయం! సరే, పడుకుంటాను — అటుతిరిగి పడుకుంటాను. నువ్వు పిల్చినా పలకను! అంతే, అః!"

దీప్తి అతని చిలిపి మాటలకు నవ్వుకుంటూ కళ్ళు మూసుకుంది.

* * *

శర్మ హడావిడిగా నిద్రలేపుతుంటే చటుక్కున లేచి కూచున్నాడు కార్తీక్.

అప్పటికే అభిలాష్, అశ్విని, హిమవంత్ పరిసరాల్లో దేనికోసమో దీక్షగా వెతుకుతున్నారు. వాళ్ళ ముఖాల్లో ఆత్రుత, ఆందోళన స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"ఏమిటి వర్మ గారూ, యేమయింది?" అన్నాడు కార్తీక్.

"ఏం కాకూడదో అదే జరిగింది. మిస్ దీప్తి కనిపించటంలేదు!" అన్నాడు వర్మ.

"కనిపించటంలేదా? ఏమిటి మీరంటున్నది?" దిగ్గున లేచి నించున్నాడు కార్తీక్. రాత్రి దాదాపు పన్నెండు గంటలవరకు తామిద్దరు మెలకువగానే వున్నారు. తెల్లవారి ఎంతసేపయింది?

వాచీ చూసుకున్నాడు. ఆరు గంటలు చూపిస్తోంది. యెక్కడినుంచో వెలుగు కిరణాలు లోపలికి పడుతున్నాయి.

అశ్విని, అభిలాష్ అక్కడికొచ్చి "మిస్ దీప్తి కనిపించలేదు. మనని బంధించిన రాతి గదితో బాటు, ఇక్కడున్న నాలుగు రాతిగదులు పూర్తిగా అంగుళం వదలకుండా చూశాం. ఎక్కడా ఆమె జాడలేదు" అన్నారు.

కార్తీక్ అదిరే గుండెలో ఆ ప్రదేశమంతా కలియ తిరిగాడు. మరోపక్క వర్మ, హిమవంత్ గాలిస్తున్నారు.

దీప్తి కనిపించలేదు!

అశ్విని, అభిలాష్, కార్తీక్ వంక ఓదార్పుగా చూసి, "రాత్రి ఆమె విషయమే మరిచి మొద్దు నిద్రపోయాం అందరమూ! నువ్వయినా చూడలేదా?" అన్నారు.

కార్తీక్ అయోమయంగా చూశాడు వాళ్ళవంక.

"రాత్రి చాలాసేపు మేమిద్దరం మాట్లాడుకున్నాం! నేను నిద్రపోకూడదనే అనుకున్నాను. కాని యెప్పుడు పట్టేసిందో ఒళ్ళెరగకుండా పట్టేసింది పాడు నిద్ర!" అన్నాడు.

"అంటే యింకా శత్రుశేషం మిగిలిపోయుండాలి!" అశ్విని పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"ఏమో, ఎలా అర్థం చేసుకోవాలో తెలీటంలేదు. ఇంతమంది ఆమె చుట్టూ వలయంలా, పెట్టని గోడలా రక్షణ వుండగా ఆమెని యెవరు ఎత్తుకుపోయి వుంటారు? వాళ్ళు మనుషులో, లేక ఏ మృగమయినా...." అభిలాష్ తక్కువ మాటలు ఉచ్చరించటానికి సంకోచించాడుగాని, ఆ భావం అందరి మనసుల్ని తాకి భయంకరంగా ప్రతిధ్వనించింది.

"అయితే దీప్తి....?" కార్తీక్ కి దుఃఖం పెల్లుబికి వస్తోంది. రాత్రి ఆమె చివరగా అన్న మాటలు గుర్తొచ్చాయి. ఆమె చెప్పిందే నిజం కాబోతోందా? గడిచిన రాత్రే ఆమె జీవితంలో చివరి రాత్రా?

వేదనతో తల విదిలించాడు కార్తీక్.

వర్మ, హిమవంత్ కూడా వెతకటం పూర్తిచేసి వాళ్ళ దగ్గరకొచ్చారు.

"సారీ మైడియర్ ఫ్రండ్స్! ఆమె జాడ యెక్కడా తెలియరావటంలేదు!" అన్నాడు వర్మ.

"కార్తీక్, కొంతమంది వెనక్కు, మరి కొంతమంది ముందుకుపోయి వెతుకుదామా?" అన్నాడు అభిలాష్.

"వెనక్కు వెళ్ళటమంటే, టైగర్ హిల్స్ కే కదా! నా అనుమానమే నిజమయితే మనం యిలా ముందుకే చొచ్చుకుపోవటం మేలు! ఆమెకేదైనా ప్రమాదం వాటిల్లివుంటే, అది మన వెనకనుంచి కాదు—ముందు నుంచే జరిగుండాలి! వెనక శత్రువులెవరూ లేరు! మాంత్రికుడితోపాటు అతని అనుచరులందర్నీ చంపేశాం కదా!" అన్నాడు వర్మ.

అందరికీ అతను చెప్తున్నదీ సబబుగానే కనిపించింది. అయితే హిమవంత్ మాత్రం తిన్నగా వుండక వర్మనుద్దే

శించి, "ఆ మాంత్రికుడు చావబోతూ ఏదో నిధి సంగతి చెప్పి చచ్చాడు. అది వెరిఫై చేసుకోవచ్చునని మీ అభిప్రాయం కాదుగదా!" అన్నాడు.

వర్మకి చప్పున కోపం వచ్చేసింది. "సమయం, సందర్భం లేకుండా మాట్లాడుతావేమిటి? మనలో ఒక వ్యక్తి, అందునా ఆడపిల్ల మాయమయిందనే ఆందోళనలో నేను మాట్లాడుతుంటే, అనవసర ప్రసంగం చేస్తావేమిటి? నిధి గొడవ యిప్పుడు దేనికి? అసలు ఆ సంగతి నిన్ననే వదిలేశాను, తెల్సా? ఈ ఉదయం అంతా సక్రమంగా వుంటే యీపాటికి టైగర్ హిల్స్‌కి చేరి వుండే వాళ్ళం! కాని జరిగింది మరొకటి!" అన్నాడు.

కార్తీక్ అంత విచారంలోను వాళ్ళిద్దర్నీ సమాధాన పరచాలని ప్రయత్నించాడు. "హిమవంత్ హాస్యాలకు ఎత్తిపొడుపులకీ సమయంకాదు. వర్మగారు నిధి గురించి మనతో ఏమీ ప్రస్తావించలేదు కదా! ఆయన చెప్పినట్టే యీపాటికి టైగర్ హిల్స్ దిగిపోతూ వుండేవాళ్ళం! కాని...."

హిమవంత్ వర్మకు సారీ చెప్పుకున్నాడు. వర్మ శాంతించాడు.

"మిస్టర్ కార్తీక్, మనం రెండు జట్లుగా యేర్పడి రెండువైపులా వెళ్దామంటే నా అభ్యంతరం లేదు. నన్ను ఎవరితో రమ్మంటే వాళ్ళతో వస్తాను. మిస్ దీపికి యేలాంటి ప్రమాదం జరిగివుండదని నా నమ్మకం!" అన్నాడు వర్మ ధైర్యం చెప్పే ధోరణిలో.

"మీరు మాకన్న వయసులోను, అనుభవంలోను పెద్దవారు. మీరెలా చెపితే అలా చెయ్యటానికి సిద్ధంగా వున్నాం" అన్నాడు కార్తీక్. అశ్విని, అభిలాష్ తల

లూపారు.

"సరే, అయితే ముందుకే పోదాం పదండి! ముందుకె వెళ్ళాక ఏమైనా విడివిడిదార్లు కనిపిస్తే ఎవరిమటుకు వాళ్ళు విడిపోయి వెతుకుతాం! మనం చేయగల ప్రయత్న మంతా చేద్దాం!" అన్నాడు వర్మ.

"ఆయుధాలు తీసుకోండి!" అన్నాడు అశ్విని తుపాకిని చేతిలోకి తీసుకుని, మరొకటి కార్తీక్ కి అందిస్తూ.

వర్మ అప్పటికే రివాల్వర్ చేత పట్టుకున్నాడు. మాగజైన్ విప్పి అరు గుళ్ళూ సక్రమంగా వున్నాయో లేదో చూసుకుని సంతృప్తిగా తలాడించాడు. బుల్లెట్సున్న బెల్టు అశ్విని మళ్ళీ నడుంకి కట్టుకున్నాడు.

అందరు ముందుకి అడుగులు వేశారు. ఎవరూ మాట్లాడు కోవటంలేదు! మౌనంగా నడుస్తున్నారు.

* • *

ఓ పది నిమిషాల తర్వాత వాళ్ళకి ఓ పర్ణశాల లాంటిది కనిపించింది. కిందనించి పైవరకు రాతిపలకలతో కట్టబడి వుంది. దాదాపు రాతి గదుల్లాగానే నిర్మించబడి వుంది. పైన రెల్లుగడ్డిలాంటి పదార్థంతో అచ్చం పర్ణశాల లాగానే వుంది!

పర్ణశాల పరిసరాల్లో ఏవో గుర్తుతెలీని చెట్లు! అవి దాదాపు అయిదడుగుల ఎత్తు పెరిగి వున్నాయి అంతే! మరుగుజ్జు చెట్లులాగా వున్నాయి.

అశ్విని ఆశ్చర్యంగా చూశాడు వాటి వంక. "సొరంగ మార్గంలో చెట్లు మొలవట మేమిటి?" అన్నాడు.

(సశేషం)